తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్టేట్ రౌండప్
STATE ROUNDUP
ప్రజాజ్యోతి తెలంగాణ
బుధవారం 27-03-2024


# చుక్కలను తాకుతున్న విద్యుత్ డిమాండ్

హైదరాబాద్, మార్చి 26:
తెలంగాణలో విద్యుత్ అవసరం అనూహ్యంగా పెరుగుతోంది. వేసవి కారణంగా ఇళ్లలో కరెంట్ వినియోగం పెరిగింది. అలాగే యాసంగి పంటలు సాగులో ఉన్నందున కూడా విద్యుత్ వాడకం అధికంగా ఉంది. 24 గంటలు కరెంట్ సరఫరా కోసం రోజుకు రూ.40 కోట్లు వెచ్చించి తెలంగాణ డిస్కంలు అదనంగా భారత ఇంధన ఎక్స్ఛేంజ్(ఐఈఎక్స్)లో కరెంటును కొంటున్నాయి. ఒక్కోరోజు 8 కోట్ల యూనిట్లు అదనంగా కొంటేనే నిరంతర సరఫరా సాధ్యమవుతోంది. తెలంగాణలో గతంలో ఎన్నడూ లేని రీతిలో ఈ నెలలో ఆరు రోజులు 30 కోట్ల యూనిట్లకుపైగా వినియోగం నమోదవడం సరికొత్త రికార్డు. గతంలో అత్యధిక వినియోగం 2023 మార్చిలో 29.7 కోట్ల యూనిట్లుంటే ఈ ఏడాది మార్చి 7, 8, 12, 13, 14, 15 తేదీల్లో రోజుకు 30 కోట్ల యూనిట్లకుపైగా కరెంటు వినియోగమైంది. రాష్ట్ర చరిత్రలో అత్యధిక వినియోగం ఈ నెల 14న 30.85 కోట్ల యూనిట్లుగా నమోదైంది. వాతావరణం చల్లబడటంతో గత రెండు రోజుల నుంచి కొద్దిగా వినియోగం తగ్గడంతో డిస్కంలు ఊపిరిపీల్చుకున్నాయి. కానీ, మరో నెలరోజులు భారీ వినియోగం ఉంటుందని సరఫరాకు ఏర్పాట్లు

మిగతా 2లో..



# తెలంగాణలో దంచికొడుతున్న ఎండలు

## ఆరెంజ్ అలెర్ట్ జారీ

హైదరాబాద్,మార్చి26:తెలంగాణలో ఎండలు దంచికొడుతున్నాయి. రాబోయే ఐదురోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరుగుతుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ క్రమంలో ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల వరకు పెరిగే ఛాన్స్ ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. 27 నుంచి 30 వరకు ఆదిలాబాద్, కుమ్రంభీం, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, మహబూబ్‌నగర్, నల్గొండ, నారాయణపేట, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్‌ను జారీ చేసింది.రాగల ఐదురోజుల పాటు రానున్న ఐదు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీలు పెరిగే అవకాశం వాతావరణ శాఖ అంచనా వేసింది. హైదరాబాద్‌లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల వరకు నమోదయ్యే ఛాన్స్ ఉందని పేర్కొంది. ఇప్పటికే పలు జిల్లాల్లో 42 డిగ్రీలను దాటాయి. రాత్రి పూట 26 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా సత్నాల, తలమడుగులో అత్యధికంగా 42.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది టీఎస్‌డీపీఎస్ తెలిపింది. చాప్రాలలో 42.1, ఆసిఫాబాద్ 42 డిగ్రీలు నమోదవగా.. పలు జిల్లాల్లో 40కిపైగా ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయని పేర్కొంది.



# తగ్గిపోతున్న నీటి నిల్వలు

## డెడ్ స్టోరేజీకి శ్రీశైలం జలాశయం

### తెలుగు రాష్ట్రాలకు తాగు నీటికి తీవ్ర ఇబ్బందులే

### కేఆర్ఎంబీ విజ్ఞప్తులను పట్టించుకోని రెండు రాష్ట్రాలు

హైదరాబాద్, మార్చి 26: నంద్యాల జిల్లా రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు సాగు త్రాగునీరందించే శ్రీశైలం జలాశయం.. ఇప్పుడు నీటి నిల్వలు తగ్గిపోయి వెలవెలబోతుంది. కృష్ణా రివర్ మేనేజ్మెంట్ బోర్డు తెలుగు రాష్ట్రాలకు పలుమార్లు విజ్ఞప్తులు చేసినా, ప్రభుత్వాలు మాత్రం పట్టి పట్టనట్లు వ్యవహరించడమే ఇందుకు కారణం. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు అవసరం 215 టీఎంసీలకు గాను..

మిగతా 2లో..



# ప్రాణం ఉన్నంత వరకు కేసీఆర్ వెన్నంటే ఉంటా

ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్పష్టీకరణ

**హైదరాబాద్,మార్చి26:** కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు వస్తున్న వార్తలపై హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. తాను పార్టీ మారడం లేదని, ఆ వార్తలను తీవ్రంగా ఖండిస్తున్నాను. తన గొంతులో ప్రాణం ఉన్నంత వరకు కేసీఆర్‌తోనే ఉంటానని కౌశిక్ రెడ్డి తేల్చిచెప్పారు. దీనికి సంబంధించి ఎక్స్ వేదికగా కౌశిక్ రెడ్డి ఓ వీడియో విడుదల చేశారు.తెలంగాణ ప్రజలకు, హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలకు నమస్కారం.. ఇవాళ( మంగళవారం) పొద్దున్నే లేవగానే.. సోషల్ మీడియాలో ఒక వార్త చూశాను.

మిగతా 2లో..



# చుక్కలను తాకుతున్న విద్యుత్ డిమాండ్

మొదటిపేజీ తరువాయి..

చేస్తున్నాయి. యాసంగి పంటలు ఏప్రిల్ చివరిదాకా సాగులో ఉంటాయి. వాటి కోతలయ్యే దాకా అధిక వినియోగం ఉంటుందని విద్యుత్ ఇంజినీర్లు చెప్పారు. వినియోగం ఎంత పెరిగినా ఎక్కడా కోతల్లేకుండా సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలివ్వడంతో డిస్కంలు అందుకు అనుగుణంగా ఐఈఎక్స్‌లో భారీగా కొంటున్నాయి. మరోవైపు దేశవ్యాప్తంగా ఫిబ్రవరిలో 12,779 కోట్ల యూనిట్ల కరెంటు వినియోగమైందని.. 8 శాతం డిమాండ్ అదనంగా పెరిగిందని కేంద్ర విద్యుత్ శాఖ తెలిపింది. ప్రస్తుత సంవత్సరం(2023-24)లో ఇంకా ఈ నెల మిగిలి ఉండగానే ఫిబ్రవరి ఆఖరు నాటికే మొత్తం విద్యుత్ వినియోగంలో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలతో పోల్చి చూస్తే తెలంగాణ 8వ స్థానంలో ఉందని కేంద్ర విద్యుత్ మండలి(సీఈఏ) తాజా నివేదికలో వెల్లడించింది. అత్యధికంగా మహారాష్ట్ర 1,88,164 మిలియన్ యూనిట్లతో అగ్రస్థానంలో ఉండగా ఆ తర్వాత ఉత్తర్‌ప్రదేశ్ 1,37,758, గుజరాత్ 1,33,194, తమిళనాడు 1,13,816, రాజస్థాన్ 97,883, మధ్యప్రదేశ్ 90,819, కర్ణాటక 84,186, తెలంగాణ 76,091, ఏపీ 73,458 మిలియన్ యూనిట్లు వినియోగించాయి.

# ప్రాణం ఉన్నంత వరకు కేసీఆర్ వెన్నంటే ఉంటా

మొదటిపేజీ తరువాయి..

నేను కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ఒక వార్త వచ్చింది. ఈ సందర్భంగా హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలకు స్పష్టంగా తెలియజేస్తున్నాను.. నా గొంతులో ప్రాణం ఉన్నంత వరకు కేసీఆర్‌తో, వారి కుటుంబంతో ఉంటాను. పార్టీ మారుతున్నట్లు ఇలాంటి చిల్లర వార్తలు దయచేసి రాయొద్దని జర్నలిస్టులను కూడా కోరుతున్నాను. ఈ వార్తలను తీవ్రంగా ఖండిస్తున్నాను. ఇలాంటి తప్పుడు వార్తలు రాసిన జర్నలిస్టులందరిపై లీగల్ చర్యలు తీసుకుంటాను. త్వరలోనే లీగల్ నోటీసులు పంపిస్తాను. పరువు నష్టం దావా కూడా వేస్తాను. ఇలాంటి చిల్లర వార్తలను నియోజకవర్గ ప్రజలు ఎవరూ నమ్మొద్దని విజ్ఞప్తి చేస్తున్నాను అని పాడి కౌశిక్ రెడ్డి ఎక్స్ లో తెలిపారు.

# తగ్గిపోతున్న నీటి నిల్వలు



మొదటిపేజీ తరువాయి..

ఇప్పుడు మిగిలింది 34 టీఎంసీలే పోటాపోటీగా విద్యుదుత్పత్తి చేయడం జలాశయంలో నిటి నిల్వలు తగ్గిపోయాయి. కేఆర్ఎంబీ విజ్ఞప్తులను రెండు రాష్ట్రాలు పట్టించుకోలేదు. అవసరం లేకున్నా విద్యుదుత్పత్తి చేయడమే శ్రీశైలం జలాశయం డెడ్ స్టోరేజికి కారణం అంటున్నారు అధికారులు. డెడ్ స్టోరేజీకి చేరువలో శ్రీశైలం జలాశయం చేరుకుంది. డ్యామ్ లో నిటినిల్వలు తగ్గిపోయాయి. ఇక ఈ ఎండాకాలం సీజన్ లో రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు తాగు నీటికి తీవ్ర ఇబ్బందులు ఎదు-ర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడనుంది.

ఇందుకు కారణం ఇరు తెలుగు రాష్టాలు పోటాపోటీగా జలవిద్యుదుత్పత్తి చేయడమే. గత వర్షాకాలంలో సీజన్ లో నిండుకుండలా శ్రీశైలం జలాశయం నిండుకుంది. శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215 టీఎంసీల సామర్థ్యానికి గాను..ఇప్పుడు 34 టీఎంసీల డెడ్ స్టోరేజీ స్థాయికి నీటి నిల్వలు అడుగంటిపోయాయి. తాగు, సాగునీటి అవసరాలున్నప్పుడు మాత్రమే జలవిద్యుత్తును ఉత్పత్తి చేయండి. అనవసరంగా విద్యుదుత్పత్తి వద్దు" అంటూ కృష్ణా నదీ యాజమాన్య బోర్డు(కేఆర్ ఎంబీ) చేసిన విజ్ఞప్తులను బుట్టదాఖలు చేసి%ా ా% ఇరు తెలుగు రాష్ట్రాలు పోటాపోటీగా విద్యుదుత్పత్తి చేయడంతో ఈ దుస్థితి నెలకొంది.

ఈ పరిస్థితులను ముందే ఊహించిన కేఆర్ఎంబీ ఇరు రాష్ట్రాలను హెచ్చరిస్తూ పలుమార్లు లేఖలు రాసింది. చివరికి బతిమాలుతూ జలవిద్యుత్తును నిలిపివేయాలని కోరింది. తాగు, సాగు నీటి అవసరాల కోసం మాత్రమే జల విద్యుత్తు ఉత్పత్తి జరగాలి. కానీ, సాగు, తాగునీటి అవసరాలకు లేకుండా శ్రీశైలంలో జలవిద్యుత్తును ఉత్పత్తి చేయడంతో విలువైన నీరు దిగువకు వెళ్లిపోయింది. రానున్న రోజుల్లో సాగు, తాగునీటికి ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉంది. శ్రీశైలం జలాశయంలో గత ఏడాది మార్చి 26 ఇదే సమయానికి 809.60 అడుగులుగా 34.4273 టి.ఎం. సి. జలాశయంలో నీరు ఉంది. అయి-ంతే, ప్రస్తుతం ఇవాళ శ్రీశైలం జలాశయం నీటిమట్టం 810.70 అడుగులుగా ఉంది. శ్రీశైలం జలాశయం పూర్తీ స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 810. 70 అడుగులుగా ఉంది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 34.6979 టీఎంసీలుగా నమోదైంది. అయితే శ్రీశైలం జలాశయం ప్రస్తుతం నీరులేక అడుగంటిపోయింది.

# వాలంటీర్ల జీవితాలు మారుస్తా

యువతకు సామాజిక బాధ్యత ఉండాలి
వైసీపీ ప్రభుత్వ పాలనలో ఉపాధి, ఉద్యోగాల కొరత
జాబ్ కేలండర్ పేరుతో యువతను మోసం చేస్తున్న జగన్
టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు

కుప్పం,మార్చి26( ): కుప్పం నియోజకవర్గంలో పర్యటిస్తున్న టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు యువతతో భేటీ అయ్యారు. యువతకు సామాజిక బాధ్యత ఉండాలని సూచించారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక యువత ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏటా జాబ్ కేలండర్ విడుదల చేస్తామని సీఎం వైఎస్ జగన్ యువతను మోసం చేశారని చంద్రబాబు విమర్శించారు. గత ఐదేళ్లలో ఉపాధ్యాయ నియామకాలు చేపట్టలేదని మండిపడ్డారు. ఎన్నికల ముందు మాత్రం డీఎస్సీ పేరుతో హడావుడి చేస్తున్నారని విమర్శించారు. గ్రూప్-1 ఉద్యోగాలను నచ్చినవారికి ఇచ్చుకున్నారని ఆరోపించారు. ఏపీని కాపాడుకునేందుకు పొత్తులు పెట్టుకున్నామని చంద్రబాబు తెలిపారు. టీడీపీ, జనసేన , బీజేపీ అందుకే కలిశాయన్నారు. జెండాలు వేరైనా.. అజెండా మాత్రం ఒక్కటేనని స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామన్నారు.వైసీపీ నేతలు భూములు కొల్లగొడుతున్నారని చంద్రబాబు ఆరోపించారు. సర్వే నంబర్స్ మార్చి ప్రజల భూములను ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. సొంత నియోజకవర్గం కుప్పంలోనూ తనకు బెదిరింపులు తప్పటం లేదన్నారు. ఇక ఏపీలో సామాన్యుల పరిస్థితి ఏంటో ఆలోచించుకోవాలన్నారు. ఏపీలో ఖనిజ సంపదను వైసీపీ నేతలు దోపిడీ చేస్తున్నారని చంద్రబాబు ఆరోపించారు. గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయని మండిపడ్డారు. ఇలా అడ్డదారుల్లో డబ్బు సంపాదించడమే లక్ష్యంగా వైసీపీ నేతలు ఉన్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో జే బ్రాండ్ మద్యాన్ని నిషేధిస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. ఏపీని మళ్లీ అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. తన హయాంలో యువతకు ఐటీ ఉద్యోగాలతో కొత్తదారి చూపించానని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అక్రమార్కుల చేతుల్లో పడితే చాలా ప్రమాదకరమని చంద్రబాబు హెచ్చరించారు. పారదర్శకంగా జరగాల్సిన పాలనలో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. టెండర్స్ లోనూ అక్రమాలు చేస్తున్నారని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి నియోజకవర్గానికి అభివృద్ధి ప్రణాళిక రూపొందిస్తామని చంద్రబాబు ప్రకటించారు. మండల కేంద్రాల్లో వర్క్ స్టేషన్లు నిర్మిస్తామని తెలిపారు. భవిష్యత్తులో ఇంటి నుంచే పని చేసుకునే వెసులుబాటు కల్పిస్తామని చెప్పారు. వాలంటీర్లు నెలకు రూ.30 వేల నుంచి రూ.50 వేలు సంపాదన వచ్చేలా వారికి స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా శిక్షణ ఇస్తామన్నారు. వారి జీవితాలు మారుస్తామన్నారు.

## ఏప్రిల్ 16 నుంచి ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాలు

ఒంటిమిట్ట,మార్చి26( : వైఎస్ఆర్ జిల్లా ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 16 నుంచి అంగరంగ వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ విజయరామారావు, టీటీడీ జేఈవో వీరబ్రహ్మం తెలిపారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై శుక్రవారం అధికారులతో కలసి క్షేత్రస్థాయి సమీక్ష నిర్వహించారు. ఏకశిలా నగరం ఒంటిమిట్టలో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్సవాలు నిర్వహిస్తోంది. ఈ ఏడాది కూడా ఏప్రిల్ 16వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ విజయరామారావు, టిటిడి జె ఈ ఓ వీరబ్రహ్మం తెలిపారు. ఏప్రిల్ 16వ తేదీ సాయంత్రం అంకురార్పణతో శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నట్లు వెల్లడించారు.అలాగే అత్యంత విశిష్ఠమైన స్వామి కళ్యాణం ఏప్రిల్ 22న అంగరంగ వైభవంగా నిర్వహించునున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలతో పాటు కోదండరామ స్వామి కల్యాణానికి హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైనన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ జేఈవో తెలిపారు. కల్యాణోత్సవం సందర్భంగా ఏర్పాటు చేయాల్సిన గ్యాలరీలు, భక్తులను అనుమతించాల్సిన విధానం, తాగునీరు, అన్నప్రసాదాల వితరణ ఏర్పాట్లపై సమీక్ష జరిపామన్నారు. వీటితో పాటు పలు ఆధ్యాత్మిక భావనను ఉట్టిపడేలా పలు కళాఖండాలను ప్రదర్శించనున్నట్లు వెల్లడించారు.

## తెలంగాణ ఆర్టీసీలో 3000ఉద్యోగాలు

హైదరాబాద్, మార్చి26( : ఆర్టిసి త్వరలో మరో 200 కొత్త ఆర్టిసి బస్సులను ప్రారంభించనుంది. అలగే, లోక్ సభ ఎన్నికలు ముగిసిన తర్వాత ఆర్టిసిలో 3 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.




జహీరాబాద్ పర్యటన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ అవినీతి పునాదులపై నిర్మించిన బిఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయిన 100 రోజుల్లోనే కుప్పకూలిపోతుందని ఆయన విమర్శించారు. తెలంగాణలో నియంతృత్వానికి వ్యతిరేకం గా ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారన్నారు. కాంగ్రెస్ పార్టీ అన్ని మతాలు, కులాలను గౌరవిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కవి త అరెస్ట్ బిఆర్ఎస్, బిజెపిల రాజకీయ ఎత్తుగడేనని ఆ యన ఆరోపించారు. లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఈ సందర్భంగా మంత్రి పొన్నం విజ్ఞప్తి చేశారు.

## కేజీవ్రాల్‌కు కస్టడీలో కాగితం ఎలా దొరికింది?

న్యూ ఢిల్లీ, మార్చి 26 : ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కస్టడీలో ఉన్న ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆదివారం తన సహచర మంత్రికి ఆదేశాలు జారీ చేయడాన్ని ఈడీ తీవ్రంగా పరిగణించింది. కస్టడీ సమయంలో ప్రధాన కార్యాలయంలో ఉన్న కేజ్రీవాల్‌కు కంప్యూటర్ లేదా కాగితాలను తాము సమకూర్చలేదని దర్యాప్తు సంస్థ చెబుతోంది. ఆదేశాలు బయటకు ఎలా వెళ్లాయో తెలుసుకొనేందుకు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో ఆదేశాలు పేర్కొన్న కాగితం ఎక్కడి నుంచి వచ్చిందో తెలుసుకొనేందుకు ఆప్ మంత్రి ఆతిశీని ఈడీ ప్రశ్నించే అవకాశం ఉంది. దీంతో పాటు జైల్లో కేజ్రీవాల్ కదిలికలను గమనించేందుకు సీసీ టీవీ దృశ్యాలను కూడా పరిశీలించవచ్చని చెబుతున్నారు.

# ఈవెంట్ ఇండస్ట్రీ వృత్తి నైపుణ్యంతో పని చేయాలి

– ఈవెంట్ నీడ్జ్ ప్రారంభోత్సవంలో జయేష్ రంజన్



**శేరిలింగంపల్లి,మార్చి 26 (ప్రజాజ్యోతి):** ఈవెంట్ ఇండస్ట్రీ వృత్తి నైపుణ్యంతో పని చేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ ఐటీ, ఐ %డ% సీ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ తెలిపారు. ఈవెంట్ ప్లానింగ్ కోసం ఏర్పాటైన గేమ్ ఛేంజర్ ప్లాట్‌ఫారమ్ 'ఈవెంట్ నీడ్జ్'ను టీ హబ్ లో ఆయన లాంచనంగా ప్రారంభించారు. ఇది కొంపల్లి డేటా సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కు చెందినది. ఈ విప్లవాత్మక ఆన్‌లైన్ మార్కెట్ ప్లేస్ సమగ్ర సేకరణకర్తగా పని చేస్తుంది. ఇది రెంటల్స్, సేల్స్ వెండర్‌లతో వినియోగదారులను కనెక్ట్ చేస్తుంది. అన్ని రకాల సేవలు ఒకే పైకప్పు కింద ఉంటాయి. ఈ కార్యక్రమానికి టీ హబ్ సీవోవో అనీష్ ఆంథోనీ, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఎంఎస్ఎంఈ డైరెక్టర్ జనరల్ ఎస్ గ్లోరీ స్వరూప, టీసీఈఐ అధ్యక్షుడు బలరాం బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా జయేష్ రంజన్ మాట్లాడుతూ మెరుగైన ప్రణాళికతో మెరుగైన అమలుతో అంచనాలకు తగ్గట్టు శాస్త్రీయంగా అంచనా వేయాలన్నారు. ఈవెంట్ ఏదైనా నిర్దిష్ట బడ్జెట్‌తో కచ్చితంగా ప్లాన్ చేయగలగలన్నారు. నిర్దిష్ట బడ్జెట్‌లో ఈవెంట్ చేస్తామని ఏజెన్సీలు హామీ ఇవ్వగలగలన్నారు. ఈ ఇండస్ట్రీకి మెరుగైన సంస్థ, మెరుగైన వృత్తి నైపుణ్యం అవసరమన్నారు. టెక్నాలజీ సవాళ్లను అధిగమించగలదని చెప్పారు. ఈ ఇండస్ట్రీ వ్యవస్థీకృత విధానంలో గొప్ప మార్పును తీసుకురాగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. టెక్నాలజీపై పట్టు పెంచుకోవడం టీసీఈఐ వంటి ఈవెంట్ ఇండస్ట్రీ అసోసియేషన్‌ల బాధ్యత అన్నారు. టెక్నాలజీకి ప్రాచుర్యం పెంచడం, అసోసియేషన్‌లోని ప్రతి సభ్యుడు అర్థం చేసుకోవడం, వర్తింపజేయడం అవసరమన్నారు. హైదరాబాద్ నుంచి ఇటువంటిది అభివృద్ధి చెందడంతో పాటు మరిన్ని నగరాలకు తీసుకెళ్తున్నందుకు సంతోషిస్తున్నానని తెలిపారు. ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంటుందన్నారు. క్రియాశీల వినియోగదారులుగా ఉంటామని చెప్పారు. ఈ సందర్భంగా ఈవెంట్ నీడ్జ్ – కొంపల్లి డేటా సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్రాండ్ ఎండీ సీఈవో జ్యోత్స్న కొంపల్లి మాట్లాడుతూ ఈవెంట్ నీడ్జ అనేది ఈవెంట్ ప్రణాళిక, సర్వీసెస్, ప్రొడక్ట్స్ సహా ఈవెంట్ అవసరాల గమ్యస్థానంగా ఉంటుందని ఆయన అన్నారు.

## అడ్వర్టైజింగ్ రెగ్యులేషన్ బలోపేతానికి భాగస్వామ్య ఒప్పందం

**హైదరాబాద్, మార్చి 26 (ప్రజా జ్యోతి) :** భారత దేశంలో అడ్వర్టైజింగ్ రెగ్యులేషన్‌ను బలోపేతం చేయడానికి సీసీపీఏ, ఏఎస్ సీఐ భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నట్లు డీఓసీఏ సెక్రటరీ రోహిత్ కుమార్ సింగ్ మంగళవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కన్స్యూమర్ అఫైర్స్(డీఓసీఏ) ది అడ్వర్టైజింగ్ స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఏఎస్ సీఐ) రెండూ వినియోగదారుల ప్రయోజనాలను రక్షించే పరస్పర లక్ష్యంతో పనిచేస్తాయని తెలిపారు. ఏఎస్ సీఐ సీఈఓ, సెక్రటరీ–జనరల్ మనిషా కపూర్ మాట్లాడుతూ తప్పుదారి పట్టించే ప్రకటనలకు సంబంధించి ఏఎస్ సీఐ ద్వారా నమోదు చేయబడిన ఏదైనా కేసు సీసీపీఏ ద్వారా వినియోగదారుల రక్షణ చట్టం 2019కి అనుగుణంగా తక్షణమే పరిష్కరించ బడుతుందని తెలిపారు.

## అనాధల రక్షణకై శిఖ గోయెల్‌కు ఉత్తర్వులు జారీ చేసిన కాంతి వేస్లి

– అనాధల సంక్షేమానికి కృషి చేస్తున్న వెంకటయ్య సేవలకు గుర్తింపు



**హైదరాబాద్, మార్చి 26 (ప్రజా జ్యోతి) :** తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అనాధల మాన ప్రాణాలకు రక్షణ కల్పించాలని 33 జిల్లాల ఎస్. హె. చ్. ఓలకు ఆదేశాలు జారీ చేయాలని ఉమెన్ సేఫ్టీ వింగ్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శాఖ ఉమెన్ సెఫ్టి వింగ్ శిఖ గోయెల్ కు రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కాంతి వేస్లి ఐఏఎస్ ఉత్తర్వులు జారీ చేసినట్లు అంజలీ తెలంగాణ అనాధ హక్కుల పరిరక్షణ సంస్థ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు, అనాధ హక్కుల పోరాట వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొక్క వెంకటయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తన విజ్ఞాపన మేరకు ఆదేశాలిచ్చిన కాంతి వెస్లీకి వెంకటయ్య కృతజ్ఞతలు తెలిపారు. అనాధల కోసం గత రెండున్నర దశాబ్దాలుగా చేస్తున్న పోరాటాలకు గుర్తింపు రావడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రంలో చాలా చోట్ల అనాథలను సంరక్షకులు, ఇతర వ్యక్తులు, కొందరు అధికారులు సైతం కొట్టి, తిట్టి బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని జిల్లాల కలెక్టర్లకు పోలీస్ శాఖలకు అనేకసార్లు అనాధలకు రక్షణ కల్పించమని సెక్రెటేరియేట్ నుంచి ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఎక్కడ కూడా అనాధలకు తహసీల్దార్ లు, ఆర్డీవోలు, కలెక్టర్లు ఎలాంటి రక్షణ కల్పించడం లేదన్నారు. కనీసం అపాయింట్మెంట్ ఇవ్వక పోవడం వల్ల ల్యాండ్ గ్రాబర్స్ చిత్రహింసలకు గురి చేస్తున్నారని అన్నారు. పోలీస్ స్టేషన్, తహశీల్దార్ ఆఫీసులకు వెళితే న్యాయం చేయకుండా తప్పుడు కేసులు పెట్టి రిమాండ్ చేస్తున్నారని అన్నారు. కావున అనాధలను ఆదుకోవాలని అన్నారు. అనాధలకు గతంలో ప్రభుత్వాలు ఇంటి పట్టాలు, అగ్రికల్చర్ భూములను ఇచ్చారని, అలాంటి భూములను ప్రస్తుతం కొందరు తహసిల్దార్, ఎస్సై, సీఐలతో కలిసి ల్యాండ్ గ్రాబర్స్ తో కుమ్మక్కై అనాధల భూములను కబ్జాలు చేస్తున్నారన్నారు. పైగా అనాధలపై దాడులు చేస్తూ వారి భూములను కబ్జాలు చేస్తున్నారన్నారు. ఇకపైన రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఎక్కడైనా ఆనాధలపైన దాడులు జరిగిన ఎవ్వరైన కొట్టిన ఎలాంటి సమస్యలు వున్నా తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## చేవెళ్ల పార్లమెంట్ ఆత్మీయ సమ్మేళనములో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**శేరిలింగంపల్లి, మార్చ్ 26 (ప్రజాజ్యోతి):** చేవెళ్ల పార్లమెంట్ ఇంచార్జ్ రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన చేవెళ్ల పార్లమెంట్ ఆత్మీయ సమ్మేళనంలో చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్. జి. రంజిత్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ ,ప్రభుత్వ సలహాదారులు, వేం నరేందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు చల్లా నర్సింహా రెడ్డి, చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గ ఎమ్మెల్యేలు, ఇంఛార్జీలతో, చైర్మన్లతో కలిసి పాల్గొని చేవెళ్ల పార్లమెంట్ లో కాంగ్రెస్ జెండాను ఎగిరేయాలని సందేశం ఇచ్చారు శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి, పిసిసి అధ్యక్షులు ఏ. రేవంత్ రెడ్డి పార్లమెంట్ ఎన్నికలకు చేవెళ్ల ఇంచార్జిగా వ్యవహరించడం వారి నాయకత్వంలో శేరిలింగంపల్లి నియోజవర్గం నుంచి భారీ మెజారిటి అందించాలని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన మొదటి రోజే ప్రచారం లో భాగంగా వారు ఇచ్చిన మాట నిలుపుకుంటూ అంగవైకల్యం కలిగిన మహిళకు ఉద్యోగం కల్పించడం వారి దయ హృదయాన్ని నిదర్శనం అని అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన రెండు రోజుల్లోనే రెండు గారంటీలను అమలుపర్చడం, 60 రోజులలోపే మరో రెండు గారంటీలను అమలు రూపం దాల్చడం వారి పాలనా దక్షతను చాటుతుందని కొనియాడారు. రేవంత్ అన్న నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ 100 రోజుల పనితీరుకు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ భారీ ఎత్తున కాలనీలు, బస్తిల నుండి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. వారి చేరికలతో కాంగ్రెస్ పార్టీకి మరింత బలం చేకూరిందని, ఈ సారి పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టడం కాయం అని తెలిపారు. చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ లోక్సభ అభ్యర్థి డాక్టర్. జి. రంజిత్ రెడ్డి గురించి మాట్లాడుతూ. గతంలో రంజిత్ రెడ్డి తో కలిసి పని చేసిన అనుభవం తనకు ఉన్నదని, ఆయన మృదు–స్వభావిగా, ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండే వ్యక్తిగా చేవెళ్లలో అందరికి సుపరిచితుడని, ఆలాంటి వ్యక్తిని మనకు లోకసభ అభ్యర్థిగా అందించిన సోనియా గాంధీ హారు, రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అధిష్ఠానం నమ్మకాన్ని నిలుపుకునేలా చేవెళ్ల లోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, రంజిత్ రెడ్డి కి భారీ మెజారిటీ అందించేలా కృషి చేయాలనీ పిలుపునిచ్చారు. శేరిలింగంపల్లి తరుపున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు చేవెళ్ల లో భారీ మెజారిటీ అందించాలనే దృఢ సంకల్పంతో ఉన్నారని, ప్రతి నాయకుడు, కార్యకర్త పార్టీ గెలుపే ధ్యేయంగా పని చేయడానికి పట్టుదలతో ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో అత్యధిక ఎంపీ స్థానాలలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడం కాయం అని తెలిపారు.

## డ్రిప్ మల్చింగ్ పద్ధతితో అధిక లాభాలు..!

– తక్కువ నీరు అవసరమయ్యే సాగు పైపులు రైతులకు వెలుగు

– భానుడు తీవ్రకు ఎండుతున్న చెరువులు, కుంటలు

– గణనీయంగా పడిపోయిన భూగర్భ జలాలు – విక్రయానికి సిద్ధంగా ఉన్న కూరగాయలు





**నందిగామ, మార్చి 26 (ప్రజాజ్యోతి):** ఏడాది ఆశించిన మేరకు వర్షాలు కురవకపోవడంతో భూగర్భ జలాలు మట్టులు గణనీయంగా పడిపోయాయి. చెరువుల కుంటల్లో నీరు లేక పూర్తిగా ఎండిపోయాయి. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలంలో రంగాపూర్ మాజీ సర్పంచ్ ఏనుగొండ రమేష్ గౌడ్ మాట్లాడుతూ డ్రిప్ మల్చింగ్ పద్ధతితో కూరగాయల్లో అధిక లాభాలు ఉంటాయని అన్నారు. తక్కువ నీరుతో సాగు రైతులకు లాభాదాయకంగా ఉంటాయని తెలిపారు. ఈ ఏడాది వర్షాలు కురవకపోవడంతో బోర్లలో సరిగా నీరు లేకపోవడంతో డ్రిప్ తోనే కూరగాయల పంటలు పండించనున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా డ్రిప్ పద్ధతితోనే కూరగాయలు సాగు చేస్తామన్నారు. టమాటా, పచ్చిమిర్చి, చిక్కుడు ఇలా రకరకాల కూరగాయలు డ్రిప్ తోనే సాగు చేస్తామన్నారు.

## ఫెర్నాండెజ్ హాస్పిటల్‌లో 'వరల్డ్ డౌలా వీక్' వేడుకలు

**హైదరాబాద్, మార్చి 26 (ప్రజా జ్యోతి) :** ప్రపంచ డౌలా వారాన్ని పురస్కరించుకొని ఫెర్నాండెజ్ హాస్పిటల్ డౌలా ఓపెన్ హౌస్, బెల్లీ మ్యాపింగ్‌తో వినోదభరితమైన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఫెర్నాండెజ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్, ఎండీ డాక్టర్ ఎవిటా ఫెర్నాండెజ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ వరల్డ్ డౌలా వీక్ థీమ్–డౌలాస్ సపోర్ట్ యు ప్రకారం, ఫెర్నాండెజ్‌లోని డౌలా బృందం గర్భధారణ, ప్రసవం, ప్రసవాన్ని మంచి అనుభవంగా మార్చే అన్ని సాధనాలు, మార్గాలను చూపించడానికి కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. గర్భధారణ, ప్రసవ సమయంలో డౌలస్ జంటలకు ఎలా మద్దతు ఇస్తారనే దాని గురించి మరింత తెలుసుకోవాలనుకునే 15 మంది జంటలు ఓపెన్ హౌస్‌కు హాజరయ్యారని తెలిపారు. 32 వారాల కంటే ఎక్కువ గర్భిణీ ఉన్న జంటల కోసం బెల్లీ మ్యాపింగ్ తల్లులను ఆకర్షించిందన్నారు.



# రాజేశ్వరి వృద్ధాశ్రమంలో ఉచిత క్షౌర సేవలు



**కూకట్‌పల్లి, మార్చి 26 (ప్రజా జ్యోతి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ సాయి నగర్ లోని రాజేశ్వరి వృద్ధాశ్రమంలో పంబి శ్రీనివాస్ ఆధ్వర్యంలో 56వ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం పంబి శ్రీనివాస్, ఆయన కుమారులు కలిసి వృద్ధులకు ఉచిత క్షౌర సేవలు చేశారు. ఈ సందర్భంగా పంబి శ్రీనివాస్ మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అనే భావంతో సేవా భావాన్ని చాటుతూ వృద్ధులకు తమ వంతు సేవగా క్షౌర సేవలు అందించడం మనసుకు ఎంతో తృప్తిని, సంతోషాన్ని ఇచ్చిందని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరు బాధ్యత

- బస్తీ అధ్యక్షుడు ఊట్ల చంద్ర రెడ్డి



**కూకట్ పల్లి, మార్చి 26 (ప్రజా జ్యోతి) :** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ బస్తి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్రా రెడ్డి అన్నారు. మంగళవారం బస్తీలోని శ్రీ శ్రీ శ్రీ వీరాంజనేయ శివాలయం ఆవరణలో గల కమిటీ హాల్లో జీహెచ్ఎంసీ పారిశుద్ధ కార్మికుల ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత పై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి చంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్తీలోని ప్రతి ఒక్కరు ఇంట్లో నిత్యం పేరుకుపోయే చెత్తాచెదారాన్ని ప్రతి రోజు ఇంటి ముందుకు వచ్చే జీహెచ్ఎంసీ చెత్త రిక్షాల్లో వేయాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో చెత్తను వేయడం ద్వారా పరిసరాలు అపరిశుభ్రంగా మారి క్రిమి కీటకాలు, దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడే ఆస్కారం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ దీనిని దృష్టిలో ఉంచుకని నిత్యం పేరుకుపోయే చెత్తను చెత్త రిక్షాలో మాత్రమే వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బస్తీ ప్రధాన కార్యదర్శి భగవంత రెడ్డి, కోశాధికారి నరసింహులు ముదిరాజ్, పాపిరెడ్డి నగర్ ఎస్ ఐ ఎఫ్ అధ్యక్షురాలు వి శోభారాణి, నల్ల పోచమ్మ, ఎస్ ఐ ఎఫ్ అధ్యక్షురాలు టి పద్మ , జై హనుమాన్ ఎస్ ఐ ఎఫ్ అధ్యక్షురాలు రేణుక, కార్యదర్శులు వెంకటలక్ష్మి, లక్ష్మి, సంధ్య కోశాధికారి సౌజన్య, ఆర్పీలు రాణి స్వర్ణలత, స్వాతి, శానిటేషన్ ఎస్ఎఫ్ఐ రాములు డ్రైవర్ లోకేష్, నరసింహ స్వీపర్స్ అలివేలు, వెంకటరమణ, బిందు, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

### అతి తక్కువ కాలంలో ప్రజల

# విశ్వాసం కోల్పోయిన ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ

- మాజీ కలెక్టర్ ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి ఉమ్మడి మెదక్ జిల్లాలో మంచి సేవలందించారు
- ఈనెల 29న బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో సన్నాహక సమావేశం
- మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, సుడ మాజీ చైర్మన్ రవీందర్ రెడ్డి, రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ మాజీ సభ్యుడు పాల సాయిరాం



**సిద్దిపేట టౌన్ ప్రజాజ్యోతి :** కాంగ్రెస్ ప్రభుత్వం వందరోజుల పాలనను ప్రజలందరూ గమనిస్తున్నారని, ప్రజలంతా కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, సుడ మాజీ చైర్మన్ రవీందర్ రెడ్డి, రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ మాజీ సభ్యుడు పాల సాయిరాంలు తెలిపారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ఉమ్మడి మెదక్ జిల్లాలో కలెక్టర్ గా వెంకట్రామిరెడ్డి ఉన్న సమయంలో ఎన్నో సేవలందించారన్నారు. అలాంటి విద్యావంతుడు, మాజీ కలెక్టర్, ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డిని మెదక్ ఎంపీ స్థానానికి అభ్యర్థిగా ప్రకటించినందుకు పార్టీ అధినేత మాజీ సీఎం కేసీఆర్ కు కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో గతంలో కంటే ఎక్కువ మెజారిటీతో వెంకటరామిరెడ్డిని గెలిపించు కునేందుకు నాయకులు, కార్యకర్తలు అంతా కలిసి కృషి చేయాలని సూచించారు.

**ఈ నెల 29 సిద్దిపేట నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం**

ఈనెల 29న మధ్యాహ్నం 12 గంటలకు మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ఆధ్వర్యంలో పొన్నాల వద్ద గల జిల్లా పార్టీ కార్యాలయం వద్ద ఎంపీ ఎన్నికల సన్నాహక, నాయకులు కార్యకర్తలు విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. అట్టి సమావేశానికి సిద్దిపేట నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మెదక్ పార్లమెంటుపై గులాబీ జెండా ఎగురవేసేలా మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు దిశా నిర్దేశం, పలు సూచనలు చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మోహన్ లాల్,జాప శ్రీకాంత్ రెడ్డి, ఎల్లారెడ్డి, వజీర్, మోయిజ్ , రెడ్డి ప్రభాకర్ రెడ్డి, పెరిక మధు, మెరుగు మహేష్, రమేష్, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే సహకార సంఘ ప్రధాన ధ్యేయం

- పిఎసిఎస్ చైర్మన్ తోటిరెడ్డి రాజేందర్ రెడ్డి
- సీఈఓ నాగరాజు ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం



**యాచారం, మార్చి 26 (ప్రజాజ్యోతి):** నిరంతరం రైతు సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా సహకార సంఘం పనిచేస్తుందని సహకార సంఘం చైర్మన్ తోటిరెడ్డి రాజేందర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వ సభ్య సమావేశం సీఈఓ నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశంలో ముఖ్య అతిథులుగా చైర్మన్ తోటి రెడ్డి రాజేందర్ రెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. సంఘం ద్వారా రైతులకు వ్యవసాయ అవసరాల నిమిత్తం కావలసిన స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలను ఎప్పటికప్పుడు అందజేస్తూ రైతుల అభివృద్ధిలో సహకార సంఘం ముఖ్యపాత్రను పోషిస్తుందని అన్నారు. 2023 - 24 ఎడాదికిగాను పౌల్ట్రీ, పాడి, పశువులు, గొర్రెలు, మేకలు ఇతర అన్ని రకాల అవసరాలకు మొత్తం రూ. 5,49,23,210 దీర్ఘకాలిక రుణాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. రూ. 58 లక్షలతో నిర్మించిన నూతన సహకార సంఘం భవనం త్వరలోనే అందుబాటులోకి రానున్నట్లు పేర్కొన్నారు. రైతులు సకాలంలో రుణాలు చెల్లించి సహకార సంఘం అభివృద్ధికి మరింత తోడ్పాటు అందివ్వాలని అన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షులు కారింగు యాదయ్య, డైరెక్టర్లు పాశ్శ భాష, మక్కపల్లి స్వరూప, మద్దెల శశికళ, కంబాలపల్లి మల్లారెడ్డి, కొండాపురం కలమ్మ, అంబోజు లక్ష్మయ్య, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జలమండలి, గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ జల ప్రతిజ్ఞ

- పాల్గొన్న జలమండలి మేనేజర్ ఎస్ హరిశంకర్




**హైదరాబాద్, మార్చి 26 (ప్రజా జ్యోతి) :** జలమండలి, గాంధీ జ్ఞాన ప్రతిష్ఠ ఆధ్వర్యంలో ప్రపంచ నీటి దినోత్సవం 2024 కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం కేబీఆర్ పార్కులో వాకర్స్, సీనియర్ సిటిజన్స్, వివిధ స్వచ్ఛంద ప్రతినిధులను ఆహ్వానించి నీటి సంరక్షణపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జలమండలి జనరల్ మేనేజర్ ఎస్.హరిశంకర్ పాల్గొని అందరిచే జల ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడుగంటిపోతున్న భూగర్భ జలాలను అభివృద్ధి చేసుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం వంశీకృష్ణ, మేనేజర్ గిరిజ, పార్క్ అధ్యక్షులు రమేష్ గౌడ్, సీనియర్ సిటిజన్ అధ్యక్షులు శ్రీనివాస్, పార్థసారథి, గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ వైస్ చైర్మన్ డాక్టర్ యానాల ప్రభాకర్ రెడ్డి, చైతన్య, హరిదీప్ రెడ్డి, సాయి, శివారెడ్డి, రఘురాం, భార్గవ్, సాయి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇటుక బట్టి వద్ద విద్యుత్ షాక్‌తో బాల కార్మికుడు మృతి





**మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి,మార్చి 26 (ప్రజా జ్యోతి):** ఇటుక బట్టిలో పని చేస్తున్న పరశురాం మజాల్ (17) అనే యువకుడు కరెంట్ షాక్ తో మృతిచెందిన సంఘటన మంగళవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో చోటు చేసుకుంది. విద్యుత్ షాక్ తో మృతి చెందిన బాల కార్మికుడు ఒడిస్సా రాష్ట్రం నువాపాడ్ జిల్లా మజాగాన్ గ్రామానికి చెందిన పరశురాం మజాల్ అని తోటి కార్మికులు తెలిపారు. నారాయణపేట జిల్లా మఖ్తల్ మండలంలోని శ్రీ సాయి (లచ్చి) దాబా సమీపంలో ఎస్ బివిఎస్ (బ్రిక్స్) పేరుతో రవిశెట్టి,అరుణ్ భాగస్వామ్యంతో నెలకొల్పిన ఇటుక బట్టిలో పని చేస్తున్న పరశురాం మజాల్ (17) అనే బాల కార్మికుడు భోజనం చేసిన తర్వాత కార్మికులు ఉండేందుకు ఏర్పాటు చేసిన తాత్కాలిక రేకుల షెడ్డుపై కరెంటు తీగలు పడడంతో అది గమనించని కార్మికుడు తన వస్తువులను తీసుకునేందుకు రేకులపై చేయి పెట్టగానే ఒక్కసారిగా కరెంట్ షాక్ కొట్టడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. అది చూసిన తోటి కార్మికులు కరెంటు షాక్ కు గురైన పరశురాం మజాల్ అనే బాల కార్మికుడిని బైక్ పై మఖ్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొని రాగా దాక్టర్లు యువకుడిని పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. ఇట్టి విషయాన్ని ఇటుక బటిలో పనిచేస్తున్న సూపర్వైజర్ బట్టి యజమానితో ఫోన్లో మాట్లాడి ఇట్టి ప్రమాదంపై ఎలాంటి కేసు లేకుండా తప్పించేందుకు చనిపోయిన మైనర్ బాలుడి మృతదేహాన్ని మెరుగైన వైద్యం కోసం తీసుకెళ్తామని చెప్పి ఆసుపత్రి నుండి తరలించేందుకు ప్రయత్నిస్తుండగా అప్పటికే జరిగిన సంఘటన గురించి తెలుసుకున్న పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో సూపర్వైజర్ అక్కడి నుండి మెల్లగా జారుకున్నాడు. ఆసుపత్రికి చేరుకున్న పోలీసులు బాలుడి మృతి మృతదేహాన్ని కార్మికుల సాయంతో మార్చేరిలో ఉంచారు. ఇట్టి సంఘటనపై మఖ్తల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తామన్నారు.

# ఆత్మగౌరవ నినాదంతో ఓటేయ్యండి

- విలక్షణ నేత ఎమ్మెల్సీ అభ్యర్థి ఎన్. నవీన్ కుమార్ రెడ్డి
- మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ ను గెలిపించండి
- పాలమూరు ప్రజా గొంతుకను కాపాడండి - ఆత్మ ప్రబోధానుసారం గుర్తు చేసుకోండి
- పేదింటి రైతు బిడ్డను నేను .. ఓ పారిశ్రామికవేత్తను ఢీకొంటున్నాను
- కష్టకాలంలో పార్టీ వెనక నిలబడ్డ వారే నిజమైన వీరులు



**కొత్తూరు మార్చి 26 (ప్రజా జ్యోతి)** ఎమ్మెల్సీగా గెలిచి మన ఆత్మగౌరవాన్ని చాటుదాం, నేనూ పాలమూరు బిడ్డనే పాలమూరు గొంతునై శాసనమండలిలో ప్రశ్నిస్తా.. ఒక్కసారి అవకాశం ఇచ్చి చూడండి పాలమూరు స్థితిగతులను మార్చి చూపిస్తా అంటూ మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ బీఆర్ఎస్ అభ్యర్థి ఎన్. నవీన్ కుమార్ రెడ్డి స్థానిక ప్రజా ప్రతినిధులు ఎంపీపీ, జడ్పిటిసి, ఎంపీటీసీ, కౌన్సిలర్, కో ఆప్షన్ సభ్యులు తదితర ఓటర్లను కోరారు. మంగళవారం "మీడియాతో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. పాలను చూడకున్నా పాల పట్టువనైనా చూడాలి అంటారు పెద్దలు. పాలమూరులో జరిగిన అభివృద్ధిని చూసి ఆత్మగౌరవంతో ఓటేయండి. ముందుగా వచ్చిన చెవుల కన్నా వెనకొచ్చిన కొమ్ములు వాడి అనేది అందరికి తెలిసిందే అని అయితే గత ప్రభుత్వ విధానాలతోనే అభివృద్ధి జరిగిందన్న విషయం ఎవరూ మర్చిపోకూడదని సూచించారు. పది సంవత్సరాలుగా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఈ ప్రాంతానికి చేసిన సేవ ఎటువంటిదో ఒకసారి ఆత్మ ప్రబోధానుసారం గుర్తు చేసుకోని కారు గుర్తుకు ఓటు వేయాలని ఆయన ప్రాధేయపడ్డారు. కనుల ఎదుట కనబడుతున్న అభివృద్ధిని ఒకసారి చూడండి. తెలంగాణ రాష్ట్ర సాధనలో చావు నోట్లోకి వెళ్లి రాష్ట్ర సాధన చేసిన బిఆర్ఎస్ పార్టీని ఆ పార్టీ అధినేత కేసీఆర్ త్యాగాన్ని ఒక్కసారి పరిశీలించండి. ఎమ్మెల్సీ అభ్యర్థిగా నిలబడ్డ మీ బిడ్డకు ఓటేయాలని అభ్యర్థి నవీన్ వేడుకుంటున్నారు. ముఖ్యంగా ఎన్నికల్లో 1,439 మంది ప్రజా ప్రతినిధులు ఓటు హక్కును వినియోగించుకుంటున్నారనీ ఇందులో 870 మందికి పైగా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ఉన్నారనీ కౌన్సిలర్లు ఎమ్మెల్సీ, ఎంపీ, ఎమ్మెల్యేలు జడ్పీటీసీలు ఎంపీటీసీలు, కౌన్సిలర్లు తమ ఓటును వినియోగించుకోనున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థుల కంటే బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు అధికంగా ఉన్నప్పుడు కాంగ్రెస్ నాయకులు పోటీ పెట్టడమే ఒక అప్రజాస్వామికమని ప్రజాస్వామ్య పద్ధతిలో గెలవాల్సిన నాయకులు క్రాస్ ఓటింగ్ పై ఆధారపడి ఉన్నారని నీతి నిజాయితీ ఎక్కడ ఉందో అక్కడే ఆత్మ ప్రబోధానుసారం ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. అతిపెద్ద జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ కు ఇది సరిపోతుందా? పార్టీ కాని వారిని ప్రలోభ పెట్టి ఎన్నికల్లో గెలిచి ప్రజలకు సేవ చేసే అవకాశాలు ఉన్నాయా? ఒక్కసారి ప్రజలు నాయకులు ఆలోచన చేసుకోవాలని కోరారు. తక్కువ ఓట్లు ఉన్నప్పటికీ రంగంలోకి దిగారంటే అక్కడే అక్రమాలకు పాల్పడతారని రూఢి అవుతుందని పేర్కొన్నారు. పదేళ్ల కాలంలో బిఆర్ఎస్ చేయని అభివృద్ధి అంటూ లేదనీ రాష్ట్రము ఏర్పడిన తర్వాత అధోగతిలో ఉన్న మన ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసింది కేసీఆర్ కాదా..? వ్యవసాయ దారులు సాగులో నష్టాలపాలై ఆత్మహత్యలకు పాల్పడుతుంటే రైతుబంధు రైతు బీమా వంటి సంక్షేమ పథకాలు తెచ్చి ఆత్మహత్యలను ఆపింది ఎవరో ఒకసారి గమనించుకోవాలని కోరారు. లక్ష రూపాయల రుణమాఫీ, కళ్యాణ లక్ష్మి, పింఛన్లు, భారీ ప్రాజెక్టుల నిర్మాణం చేసింది బీఆర్ఎస్ పార్టీనే అని ముఖ్యంగా కొత్త జిల్లాలు ఏర్పాటు చేయడమే గాక కొత్త కలెక్టర్ కార్యాలయాలు, ఎస్పీ కార్యాలయాలు నిర్మించి జిల్లాలను వినూత్నంగా తీర్చిదిద్దారని పరిపాలన సౌలభ్యం చేశారని, అందుకే స్థానిక ప్రజాప్రతినిధులు ఒకసారి మననం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పది సంవత్సరాల్లో జరిగిన అభివృద్ధిని చూసి ఆత్మ ప్రబోధానుసారం తప్పక ఓటెయ్యాలని, ఏ పార్టీ ఇచ్చిన బీఫామ్ ఉందో ఆ పార్టీకి న్యాయం చేస్తే దేవుడు కూడా చల్లగా చూస్తాడని నవీన్ రెడ్డి ఆకాంక్షించారు. సమాజంలో ఎవరికి భయపడినా భయపడకపోయినా దేవుడనే వాడికి ప్రతి ఒక్కరు భయపడాలని మనం చేసే చర్య ఆ దేవుడికి తెలిసి ఉండాలని, పార్టీకి అన్యాయం చేయకుండా నిజాయితీతో ఓటు వేస్తే ధర్మం రక్షించబడుతుందని నవీన్ రెడ్డి వేదాంత ధోరణితో మాట్లాడారు. కష్టకాలంలో పార్టీకి వెన్నంటే నిలబడిన నాయకులే నిజమైన వీరులని సంబోధించారు. ఎమ్మెల్సీగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలనీ ఒకసారి ఒక రాజకీయ పార్టీ గుర్తుతో గెలిచిన నాయకుడు పదవి కాలం ముగిసే వరకు అదే పార్టీలో ఉండాలనీ, కష్టమైనా నిష్టూరమైన విలువలు కలిగిన నికార్సైన రాజకీయ నాయకులను తయారు చేసింది బీఆర్ఎస్ పార్టీ అన్నారు. అలాంటి పార్టీలో నుండి నాయకులుగా ఎదిగిన మీరు అదే పార్టీ నుండి ఎన్నికల బరిలోకి దిగిన తనను ఆదరించి అభిమానించి ఈ కష్టకాలంలో కెసిఆర్ కు అండగా ఉంటారని, పేదింటి పాలమూరులో ప్రశ్నించే గొంతుకను కాపాడుతారని మనస్ఫూర్తిగా ఆశిస్తూ అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతున్నా అని నవీన్ రెడ్డి మీడియా ముఖంగా కోరారు. పేదింటి రైతు బిడ్డనైన నేను అంచెలంచెలుగా ఎదిగి నేడు ఓ పారిశ్రామికవేత్తతో ఢీకొట్టబోతున్నానని ఈ సమరంలో నన్ను ఆశీర్వదించి శాసనమండలికి పంపించాలని వేడుకుంటున్నాను అని తెలిపారు.

# బిఆర్ఎస్ నేతపై దాడి చేసిన వ్యక్తిని రిమాండ్ చేసిన పోలీసులు



**వికారాబాద్ ప్రతినిధి, మార్చి 26(ప్రజా జ్యోతి):** పాత వ్యక్తిగత కక్ష్యలు మనసులో పెట్టుకొని హెూలీ పండుగ రోజు పులుసుమామిడి గ్రామ మాజీ సర్పంచ్ బి ఆర్ ఎస్ మండల పార్టీ ప్రెసిడెంట్ కమాల్ రెడ్డి పైన దాడి చేసిన అదే గ్రామానికి చెందిన నాగిరెడ్డి, వయస్సు 36 ను రిమాండ్ కు తరలించినట్లు వికారాబాద్ పట్టణ సిఐ ఎ. నాగరాజు తెలిపారు. అతని పైన పైన ఐపిసి సెక్షన్ 307 హత్య ప్రయత్నం క్రింది కేసు నమోదు చేసి మంగళవారం ఆరెస్ట్ చేసి వికారాబాద్ జేఎఫ్ సి ఎం ముందు హాజరుపర్చడం జరిగిందని తెలిపారు.

# వెంకట్రాంరెడ్డి ప్రజల మనిషి

- భాజాపాతో కలవనందుకే కవితను అరెస్టు చేశారు
- ప్రశ్నించే గొంతుక కావాలంటే బిఆర్ఎస్‌ను గెలిపించాలి
- మెదక్‌లో మాజీ మంత్రి హరీష్ రావు వ్యాఖ్య





**ప్రతినిధి మెదక్ ప్రజాజ్యోతి :** భారతీయ జనతా పార్టీ తో కలవనందుకే ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను అక్రమంగా అరెస్టు చేయించారని మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరు గ్యారంటీలు పదమూడు హామీ బాండ్లు ఇచ్చి సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం బూటకపు పాలన చేస్తోందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావుఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావ్, మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డి, మాజీఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డిలతో కలిసి విలేఖరులసమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లోబీఆర్ఎస్ గెలవాల్సిన అవసరం ఉందని, పార్లమెంటు తెలంగాణ కోసం ప్రశ్నించే ప్రశ్నించే గొంతుక కావాలి అంటే బీఆర్ఎస్ను గెలిపించాలనికోరారు. తెలంగాణకు కేంద్ర ప్రభుత్వాలు అన్యాయం చేశాయన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ మోసంచేసిందని ఆరోపించారు. గత పార్లమెంట్ ఎన్నికల్లోనలుగురు బీజేపీ ఎంపీలను రాష్ట్రం నుంచి గెలిపిస్తేఏనాడు పార్లమెంట్లో రాష్ట్ర ప్రజల కోసం మాట్లాడలేదన్నారు. తెలంగాణ ఆత్మగౌరవం,హక్కులు కాపాడటమే బీఆర్ఎస్ ఎజెండా అన్నారు. 14 ఏండ్లు పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించామని, 10 ఏండ్లు తెలంగాణను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా కేసీఆర్ అభివృద్ధి చేశారన్నారు. కేసీఆర్ వ్యవసాయాన్ని పండగ చేస్తే కాంగ్రెస్ దండగ చేస్తోందని, రూ. 20 లక్షల పంట ఎండిపోతే సీఎంకు వెళ్లే తీరిక లేదు కానీ, ప్రతి పక్ష నేతలను, ఎంపీలను పార్టీలో చేర్చుకోవడం, ఢిల్లీ చుట్టూ తిరిగే తీరిక మాత్రం ఉందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్లో చేరని ప్రతిపక్ష నాయకుల మీద అక్రమ కేసులు పెట్టి బెదిరింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ కు ఎందుకు ఓట్లు వేయ్యాలో చెప్పాలని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఇచ్చిన అబద్ధాల పాలన చూసి ఓటేయాలా... ప్రతిపక్షమే లేకుండా ఎమ్మెల్యేలను, ఎంపీలను తీసుకుంటూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నందుకు వేయాలా ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రెండు లక్షలరూపాయల రుణ మాఫీ జరిగిన వారంతాకాంగ్రెస్కు ఓటెయ్యండి.. రాని వారు మాత్రం బీఆర్ఎస్కు ఓటెయ్యండి అని అన్నారు. రేవంత్ రెడ్డి గద్దెనెక్కంగనే అన్ని హామీలు మర్చిపోయారాని అన్నారు. గత ఎన్నికల్లో తెలంగాణ ప్రజలకు పథకాలు ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేశారని అన్నారు. నాలుగు వేల పెన్షన్ రానోళ్లు బీఆర్ఎస్కు ఓటేయండి.. ఇస్తే కాంగ్రెస్కు ఓటేయండి కోరారు. రాష్ట్రంలో రూ. 2500 పొందిన మహిళకు ఇంతవరకు ఇవ్వలేదని, కాంగ్రెస్ పార్టీ రైతులను, మహిళలను, వృద్ధులను మోసం చేసిందన్నారు. నాలుగు నెలల్లో 140 మంది రైతులు, 38 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకున్నారని, కానీ వారిని కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మేనిఫెస్టో ఎక్కడ అమలు కావడం లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో రైతులు కాంగ్రెస్ ను ముంచుడు ఖాయమని, ప్రశ్నించే గొంతుక బీఆర్ఎస్ ప్రజల పక్షాన హామీలు అమలు చేసేదాక పోరాడుతామని తెలిపారు. రాహుల్ గాంధీ కేజ్రీవాల్ అరెస్టు అప్రజాస్వామికం అంటే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కవిత అరెస్ట్ సమంజసమన్నారని ఇది ఏమిటో ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. అదానీ, అంబానీలు మోడీ దోస్తులు గుజరాత్ మోడల్ ఫెయిల్యూర్ అని రాహుల్ గాంధీ చెప్పితే.. గుజరాత్ మెడల్ సూపర్ అని రేవంత్ అంటున్నారని అన్నారు. బీజేపీతో కొట్లాడేది బీఆర్ఎస్ పార్టీ, కేసీఆరేనని, బీజేపీతో కలవనందుకే కవిత ను అక్రమంగా అరెస్టు చేశారనిఅన్నారు. బీజేపీతో దోస్తాన్ ఎవరో.. శత్రువు ఎవరోప్రజలు ఆలోచించాలని పేర్కొన్నారు. కాంగ్రెస్కుఓటేస్తే బీజేపీకి వేసినట్టేనని, పార్లమెంట్ ఎన్నికల్లోబీఆర్ఎస్ పార్టీకి ఓటేయాలి ప్రజలను కోరారు. ఈసమావేశంలో ఎర్రోళ్ల శ్రీనివాస్, మాణిక్యం,ఫారూఖ్ హుస్సేన్, తిరుపతి రెడ్డి, ఏకే. గంగాధర్ రావు, శశిధర్ రెడ్డి దేవేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

### ఎన్నికల విధులు నిర్వహించే

# రూట్ ఆఫీసర్లు రూట్ మ్యాప్‌లు చెక్ చేసుకోవాలి

- జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ



**వికారాబాద్ ప్రతినిధి, మార్చ్ 26(ప్రజా జ్యోతి):** జిల్లాలో జరిగే సాధారణ లోక్ సభ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ విధులు నిర్వహించే రూట్ ఆఫీసర్లు, సెక్టోరియల్ ఆఫీసర్ల కు రూట్ వారిగా విదులు కేటాయించినట్లు జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. మంగళవారము ఐ డి ఓ సి సమావేశము హాలు నందు పోలింగ్ విధులు నిర్వహించే రూట్ ఆఫీసర్ల తోపాటు సెక్టోరియల్ ఆఫీసర్ల కు తమ రూట్ల వారిగా వారికి కేటాయించిన రోడ్లపై అవగాహన కలిగించారు. ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలకు సీరియల్ నంబర్ల వారిగా రూట్ ఆఫీసర్లు, సెక్టరియాల్ అధికారులకు కేటాయించిన రూట్లను చెక్ చేసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. రూట్లకు సంబంధించి రూట్ మ్యాపులు మరియు ఎన్నికల పోలింగ్ కేంద్రాల వారిగా జాబితా అందజేశారు. ఈ సమావేశంలో డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సెక్టోరియల్ అధికారులు, రూట్ అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏప్రిల్ మొదటి

## వారంలో ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలి

**– జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్**




**వనపర్తి ప్రతినిధి, మార్చి 26(ప్రజా జ్యోతి):** రబీ సీజన్ కు సంబంధించి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏప్రిల్ మొదటి వారంలో ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ ఆదేశించారు.వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు, తాగు నీటి కొరకు వేసవి ప్రణాళిక పై మంగళవారం మధ్యాహ్నం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.ధాన్యం అమ్ముకోవడం రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని మౌలిక సదు-పాయాలతో సకాలంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవం సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఖచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు.వేసవిలో తాగు నీటి సమస్య లేకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏప్రిల్ 10వ తేదీ లోపు రబీ (యాసంగి) ధాన్యం కొనుగోలు కేంద్రాలను అన్ని మౌళిక సదు-పాయాలతో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ధాన్యం బరువు కొలిచే యంత్రాలు, గోనె సంచులు, టార్పాలిన్లు, రైతులకు చలువ నీడ ఏర్పాట్లు, తాగు నీరు,తేమ కొలిచే యంత్రాలు వంటి అన్ని మౌలిక సదుపాయాలు ఉండే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. ట్రాన్స్పోర్టు కాంట్రాక్టర్ల జాబితా సమర్పించాలని, ఏ లారీ ఏ మిల్లుకు కేటాయిస్తున్నమో ముందే ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల ఇంచార్జులు ప్రభుత్వ ఉద్యోగులు అయి ఉండాలని సూచించారు.ఎఫ్.సి. ఐ , పౌర సరఫరాల శాఖకు ఇవ్వాల్సిన సి.యం.ఆర్ ధాన్యం వేగవంతంగా ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.తాగు నీటి సరఫరా పై వివరిస్తూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి తాగు నీటి సమస్యలు ఏమున్నాయో ఎప్పటికప్పుడు నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. టెల్ ఎండ్ వరకు సమానంగా నీరు సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.అవసరమైన బోర్ వెల్,మోటార్ పంప్ లు మరమ్మతులు చేయించి ఏదైనా సమస్య వల్ల మిషన్ భగీరథ ద్వారా నీరు రాకున్నా ప్రత్యామ్నాయ మార్గంలో మంచినీటి సరఫరా అయ్యే విధంగా ప్రణాళికలు ఉండాలని ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ యం. నగేష్, జిల్లా వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి, సివిల్ సప్లై అధికారి శ్రీనాథ్, మార్కెట్ అధికారి శ్వరణ్ సింగ్, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

### సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా

## కలిసిన చేవెళ్ల అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ భానుర్ ఉపేందర్ రెడ్డి

**నవాబుపేట్ మార్చి 26 (ప్రజా జ్యోతి)** చేవెళ్ల అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ భానుర్ ఉపేందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నవాబుపేట్ మండల పరిధిలోని పూలపల్లి గ్రామం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వై మహేందర్ రెడ్డి మంగళవారం రోజున సీఎం క్యాంప్ ఆఫీసులో సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకముగా కలిసి వారికి శుభాకాంక్షలు తెలిపారు.



# ప్రాజెక్టులో తగ్గుముఖం నీటిమట్టం

**ధారూర్ మార్చి 26 (ప్రజా జ్యోతి)** కోట్ పల్లి ప్రాజెక్టులో నీటి మట్టం రోజు రోజుకూ తగ్గు ముఖం పడుతుంది వారం రోజుల్లో ఒక అడుగు నీరు ప్రాజెక్ట్ లో తగ్గిపోయింది.ఈ ప్రాజెక్ట్ పరిధిలో మండలంలోని రుద్రారం,గట్టెపల్లి,బూర్గుగడ్డ, నాగసమందర్,అల్లాపూర్ గ్రామాలలో రైతులు వరి పంటలు సాగు చేస్తున్నారు.ప్రస్తుతం పంటలకు ఎలాంటి ఇబ్బంది లేకున్నా ముమ్ముందు నీటి సమస్య ఎదురయ్యే అవకాశం ఉందని మండల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



## అనుమతులు లేని కట్టెల లారీని స్వాధీనం చేసుకున్న పోలీసులు



**కొడంగల్ ఫిబ్రవరి 26 ప్రజా జ్యోతి న్యూస్ ::** మంగళవారం కర్ణాటక నుండి కొడంగల్ మీదుగా హైదరాబాద్ కు తరలిస్తున్న కట్టెల లారీని పట్టుకొని అనుమతులు చూపించమని కోరగా ఎటువంటి అనుమతులు లేకపోవడంతో కేసు నమోదు చేసి ఫారెస్ట్ అధికారులకు బదిలీ చేయడమైనదని కొడంగల్ ఎస్సై భరత్ రెడ్డి తెలిపారు.

### ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు

## జరగకుండా అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి

**– పాత నేరస్తులు,రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి**

**– నెలవారీ నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ. రక్షిత మూర్తి**




**వనపర్తి ప్రతినిధి, మార్చి 26(ప్రజా జ్యోతి):** రాబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ.రక్షిత మూర్తి అన్నారు. మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలు నందు జిల్లా పోలీస్ అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ సమావేశంలో పాల్గొన్న పోలీస్ అధికారులతో ఎస్పీ మాట్లాడుతూ రాబోయే పార్లమెంటు ఎన్నికల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ఎన్నికల సంఘం సూచనల ప్రకారం బాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు.ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సమస్యాత్మక వ్యక్తుల,రౌడీషీటర్ల కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.ప్రజలంతా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా వారిలో భరోసా కల్పించే విధంగా పనిచేయాలని తెలిపారు.గంజాయి అక్రమ రవాణా,క్రికెట్ బెట్టింగులు, జూదం,మట్కా అలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అక్రమ మధ్యము,నగదు రవాణాను నిరోధించడంలో భాగంగా చెక్ పోస్ట్ లలో విధులు నిర్వర్తించే సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సూచించారు.సరైన ఆధారాలు లేకుండా ఎవరైనా పరిమితికి మించి నగదును రవాణా చేస్తూ పట్టుబడితే ఎన్నికల నియమావళి ప్రకారం కేసుల నమోదు చేయాలని తెలిపారు.ప్రతి కేసులో 'క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్' ద్వారా నేరస్తులకు శిక్ష పడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు.కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు.పెట్రోలింగ్,బ్లూ కోల్ట్స్ వాహనాలతో అధికారులు,సిబ్బంది ఎల్లప్పుడూ రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.ప్రభుత్వ నిషేధిత గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాలకు బానిసలై యువత తమ అమూల్యమైన భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు.జిల్లా వ్యాప్తంగా హాట్ స్పాట్స్ ను గుర్తించి గంజాయిని రవాణా చేసే వ్యక్తులతో పాటు గంజాయిని సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేసి కఠినచర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని ముఖ్యమైన ప్రదేశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.దొంగతనం కేసుల్లో ప్రస్తుతం పోలీసు శాఖ వినియోగిస్తున్న సాంకేతికతను ఉపయోగించి నేరస్తులను పట్టుకుని సొత్తును రికవరీ చేసి భాదితులకు త్వరతగతిన అందేలా చూడాలని తెలిపారు.సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కోరారు.జిల్లా వ్యాప్తంగా సైబర్ నేరాల్లో నగదును కోల్పోయి,భాధితులు వెంటనే స్పందించి ఫిర్యాదు చేసినప్పుడు సైబర్ నేరగాళ్ళ ఖాతాలలో ఉన్న నగదును పుట్ ఆన్ హోల్డ్ లో ఉంచడమైనదని అన్నారు.అట్టి నగదును కోర్టు ద్వారా కొన్ని మార్గనిర్దేశాలతో భాదితులకు అందజేయడం జరిగితుందని తెలిపారు.ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి(బ్లాక్ స్పాట్స్),వాటి నివారణకై సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ బాధితులకు న్యాయం చేకూరేలా పనిచేయాలని తెలిపారు.ట్రాఫిక్ నియమాలను పాటించకుండా మద్యం సేవించి వాహనాలను నడుపుతూ,ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ శ్రీ రామదాసు తేజావత్,డిఎస్పీ.వేంకటేశ్వరరావు,డిసిఆర్బి డిఎస్పీ.కృష కిశోర్, వనపర్తి, కొత్తకోట, ఆత్మకూర్ సిఐలు,జిల్లా ఎస్సైలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

### త్రాగునీటి బోర్వెల్స్, హ్యాండ్ పంపులు

## వర్కింగ్ కండిషన్లో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి

**– అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి**



**వికారాబాద్ ప్రతినిధి మార్చి 26(ప్రజా జ్యోతి):** రానున్న వేసవిని దృష్టి లో ఉంచుకొని ప్రతి మున్సిపాలిటీ పరిది లో గ్రామ పంచాయతీ పరిధి లలో బోర్ వేల్స్ , హ్యాండ్ పంప్ లు వర్కింగ్ కండీషన్ లో ఉండేటట్లు చూడాలని జిల్లా కలెక్టర్ సి. నారయణ రెడ్డి సంబంధిత అధికారులకు ఆదేశించారు. మంగళ వారము సాయంత్రం మిషన్ భగీరథ , ఇంట్రా ఇ ఇ , అధికారులు , ఏ ఇ లు ఏం పి డి ఓ లు , ఏం పి ఓ లతో టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతిసెక్రెటరి లకు గైడ్ చేయాలని, మంజూరు అయిన వర్క్స్ అన్ని పూర్తి చేయాలన్నారు. మున్సిపాల్టి, గ్రామ పంచాయతి పరిదిలో త్రాగునీటికి సంబంధించిన పనులన్నింటిని ఏప్రిల్ 5 వరకు పూర్తి చేయాలనీ, ఎన్ని పనులకు మంజూరు అయినవి, ఎన్ని గ్రౌండ్ అయినవి, ఇంకా ఎన్ని పనులు చేయాల్సి ఉన్నవి , వాటిపై ద్రుష్టి పెట్టి పూర్తి చేయాలన్నారు. గ్రామాలలో ప్రతి ఇంటికి మిషన్ బగీరథ నీటి సరపరా అయ్యేవిదంగా చూడాలన్నారు. బోర్ లు, చేతి పంపు లు రిపేరు ఉంటె వెంటనే రిపేరు అయి ఉండాలన్నారు. ఈ సందర్భంగా మండలం వారిగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. టెలి కాన్ఫరెన్సు లో డిపి ఓ జయసుధ, మిషన్ బగీరథ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# దొంగతనం కేసులో నేరసుడికి ఒక సంవత్సరం జైలు శిక్ష

– రూ 500 రూపాయల జరిమాన

– వివరాలు వెల్లడించిన సీఐ సంతోష్ కుమార్

**తాండూర్ మార్చ్ 26 ప్రజా జ్యోతి :-** ఓ దొంగ తనం కేసులో నేరస్తుడిగా ఉన్న ఆఫీస్ పేట్ శేరి లింగంపల్లి హైదరాబాద్ కు చెందిన అబ్దుల్ నసీర్ అలియాస్ అడ్డు తండ్రి షేక్ అబ్దుల్, అనే వ్యక్తికి తాండూర్ మున్సిఫ్ కోర్ట్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ శివలీల దొంగతనం కేసును పరిశీలించిన పిదప నేరస్తుడికి ఒక సంవత్సరం జైలు శిక్ష రూ 500 రూపాయల జరమాన విధించి నట్లు పట్టణ సిఐ సంతోష్ కుమార్ వెల్లడించారు. సిఐ తెలిపిన వివరాల ప్రకారం తాండూర్ పట్టణ పోలీస్ స్టేషన్ లో క్రైం నం 252/2023 యు /ఎస్ 457 380 ఐపీసీ కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయడం జరిగిందని వెల్లడించారు. ఇట్టి కేసు విషయమై తేది 13డిసెంబర్ 2023 నాడు నేరస్తుడిని అరెస్ట్ చేసి రిమాండ్కైతం తరలించినట్లు చెప్పారు.

## పొదుపు సంఘాలకు 'శాంతి

# కొరకు నీరు' అనే అంశంపై అవగాహన సదస్సు



**హైదరాబాద్, మార్చి 26 (ప్రజా జ్యోతి) :** ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా మంగళవారం మమత ఎడ్యుకేషనల్ సొసైటి, చందులాల్ బారాదరి, జలమండలి ఆధ్వర్యంలో మహిళా పొదుపు సంఘాలకు 'శాంతి కొరకు నీరు' అనే అంశంపై అవగాహన సదస్సు కమ్మ భవన్ లో జరిగింది. ఈ సందర్భంగా పొదుపు సంఘాల ప్రతినిది మంజుల మాట్లాడుతూ నీటి సంరక్షణ, నీటి పొదుపుపై మహిళాల పాత్ర ఉందన్నారు. అక్కడికి వచ్చిన జల మండలి అధికారులు నీటి నిల్వల కొరకై ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. ఆ తర్వాత చందులాల్ బారాదరి కార్యలయంలో డీజీఎం అబ్దుల్ హాకీం ఆ జలమండలి ఉద్యగులకు అవగాహన నిర్వచించి నీటి లీకేజీలు, నీరు వృధా అరికట్టడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇంకుడు గుంతలు పునరుద్ధరణ నీటిని సంరక్షించటం మనందరి భాధ్యత చిన్న చిన్న పనులు □□□□చేయటం వల్ల నీటి వృధాను అరికట్టవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో మమత ఎడ్యుకేషనల్ సొసైటి ప్రతినిధులు కె.సుభాష్ చంద్ర, మేనేజర్ భాను ప్రకాష్ రెడ్డి, ఇబ్రహీం, ఆసిఫ్ ఖాన్, జలమండలి ఉద్యగులు పాల్గొన్నారు.

## షాద్‌నగర్ బార్ అసోసియేషన్

# జాయింట్ సెక్రటరీగా చిర్రా మధుసూదన్ రావు



**కొత్తూరు మార్చి 26 (ప్రజా జ్యోతి)** రంగారెడ్డి జిల్లా షాద్నగర్ బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా చిర్ర మధుసూదన్ రావు ఎన్నికయ్యాడు.రేపు షాద్నగర్ బార్ అసోసియేషన్ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం వివిధ పదవులకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగింది. నామినేషన్ల సమయం దాటిన తర్వాత జాయింట్ సెక్రటరీ పదవికి పోటీలో ఎవరు లేకపోవడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా మధుసూదన్ రావు మాట్లాడుతూ..తన ఎన్నికకు సహకరించిన సీనియర్ న్యాయవాదులు వేణుగోపాలరావు, జగన్మోహన్ రెడ్డి, రాజశేఖర్ రాజు, సంగమేశ్వర్, తుప్పుడు నరసయ్య, లింగం గౌడ్, సురేందర్ రెడ్డి, గోపాల్ చారి, మోహన్ రావులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పేద ప్రజల పక్షాన నిలబడి వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

# మల్కాజ్గిరి పార్లమెంటు అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలి

– కూకట్‌పల్లి ఇంచార్జి బండి రమేష్




**కూకట్‌పల్లి, మార్చి 26 (ప్రజా జ్యోతి) :** మల్కాజ్గిరి పార్లమెంటు అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ అన్నారు. నియోజకవర్గంలోని కె పి హెచ్ బి కి చెందిన ఎస్ ఎల్ ఎఫ్ లీడర్ సుందరి తన అనుచరులు 30మందితో కలసి కాంగ్రెస్ నాయకురాలు రజిత అద్వర్యంలో బాలానగర్ పార్టీ కార్యాలయంలో కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ సమక్షంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న మహిళలకు కాంగ్రెస్ పార్టీ కండువా వేసి స్వాగతించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కష్టపడి పని చేసి అభ్యర్థి సునీతా మహేందర్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలనకు ఆకార్షితులై పార్టీలో చేరిన మహిళలకు మరోసారి స్వాగతం పలుకుతునన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నప్ప టినుండి పొదుపును అలవాటు చేయాలి

– గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ వైస్ చైర్మన్ డాక్టర్ యానాల ప్రభాకర్ రెడ్డి




**హైదరాబాద్, మార్చి 26 (ప్రజా జ్యోతి) :** జలమండలి, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా నీటి సంరక్షణ, ఇంకుడు గుంతల పునరుద్ధరణ కొరకు విద్యాసంస్థలలో చేస్తున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం కిడ్జ్ పాఠశాలలో విద్యార్థులకు నీటి పొదుపుపై అవగాహన కల్పించడానికి గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ వైస్ చైర్మన్ యానాల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ చిన్నప్పటినుండి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అలవాట్లను పొదుపు చేసే విధమైన ఆలోచనను కలిగిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, సహజ వనరుల ప్రాముఖ్యత, నీటి ఉపయోగం తెలియజేసినట్లయితే ఆ పిల్లలు క్రమశిక్షణతో ఆచరిస్తారని, అవగాహన లేని వారే దుర్వినియోగం చేస్తారని తెలిపారు. ప్రతి ఒక్కరూ అధికారుల మీద, ప్రజా ప్రతినిధుల మీద బాధ్యతను నెట్టేసి మనకెలాంటి సంబంధం లేదనే భావనతో ఉండటంవల్ల నీటి ఎద్దడికి ఒక కారణమవుతుందని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యత వహిస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదని అన్నారు. తదనంతరం విద్యార్థులచే జల ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కిడ్జీ పాఠశాల ప్రిన్సిపల్ రాజేష్, చైతన్య, పల్నాటి హరిదీప్, మహేష్, ధీరజ్, సాయి, భార్గవ్, శివ, రఘురాం, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# సర్వే చేసి మా స్థలం మా ఇప్పించండి



**మొయినాబాద్, మార్చి 26 (ప్రజా జ్యోతి):** సర్వే చేసి నా స్థలం నాకు ఇప్పించాలని సురంగల్ వాసి కుర్మటి దినకర్ మొయినాబాద్ ఎమ్మార్ోను కోరారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మార్ోకు వినతి పత్రం అందించారు. ఈ మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. 1985లో సురంగల్ గ్రామంలో 185 సర్వే నెంబర్ లో 30 మంది ఎస్సీలకు బ్రతుకుదెరువు కోసం ఇచ్చిన కోళ్ల ఫామ్ స్థలంలో ఇప్పుడు కోళ్ల ఫేమ్ లేదు. కాలక్రమంలో కోళ్ల ఫేమ్ లేకపోవడంతో ఆ భూమి పైన 30 మంది కబ్జా చేసి ఉన్నారు. ఇప్పుడు ఆ 30 మందిలో తన తన తండ్రి ప్రభుదాస్ పేరుమీద రెండవదిగా రికార్డుల్లో ఉండగా అక్కడ తన భూమి కనిపించడం లేదని వాపోయారు. ఆ భూమి వద్ద ఎవరిని అడిగిన సమాధానం చెప్పడం లేదని తెలిపారు. తమ స్థలం తమకు ఇప్పించాలని కోరుతున్నారు. మా స్థలంలో ఎవరు ఉన్నారో తెలియడం లేదని, వెంటనే సర్వే చేసి మా స్థలం మాకు ఇప్పించాలని ఎమ్మార్ోను కోరుతున్నారు.

## నిరుపేద కుటుంబాలకు బాణావత్ చందు ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం



**(ప్రజా జ్యోతి మార్చ్26/ తలకొండపల్లి** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధి ఆర్లకు%శీ%ట తండాలో మంగళవారం బాణావత్ చంద్ర నాయక్ ట్రస్టు ద్వారా జరుప్లవత్ లక్ష్మి కాకతీయ దంపతులకు ఆడపిల్ల పుట్టడంతో ట్రస్టు ద్వారా చిన్నారి తల్లితండ్రులకు 3000 రూపాయలు హార్దిక సాయం అందించడం జరిగింది చిన్నారుల దంపతులు సంతోషం వ్యక్తం చేస్తూ ట్రస్ట్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో డాక్టర్ భీమ్లా నాయక్,కృష్ణా నాయక్,తిరుపతి నాయక్, వాసు నాయక్,చక్రి నాయక్,శంకర్ నాయక్ రమేష్ నాయక్,శ్రీను నాయక్,సింహాద్రి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం



**(ప్రజా జ్యోతి మార్చ్26/ తలకొండపల్లి)** తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామానికి చెందిన దుబ్బ బాలకిష్టమ్మ సోమవారం సాయంత్రం సాయంత్రం మృతి చెందింది విషయం తెలుసుకున్న బీ.ఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు సిఎల్ శ్రీనివాస్ యాదవ్ వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేస్తూ 3,000 వేల రూపాయలు ఆర్థిక సహాయ అందజేశారు ఈ కార్యక్రమంలో యాదయ్య, శ్రీరామ్,గోదా అంజి ,శ్రీశైలం, పరంధాములు, గణేష్ ,ఆంజనేయులు, రవి,నరేష్ ,శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం.. విద్యార్థి మృతి



**యాచారం మార్చి 26 (ప్రజాజ్యోతి):** బైక్ పై వెళు_న్న ఇద్దరూ రోడ్డు ప్రమాదానికి గురై 9వ తరగతి విద్యార్థి మరణించగా ఇంకొకరు గాయపడిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. మేడిపల్లిలోని హైదరాబాద్ గ్రీన్ ఫార్మసిటీ పోలీస్ స్టేషన్ సిఐ నరసింహారావు తెలిపిన వివరాల మేరకు కందుకూరు మండల పరిధిలోని మాలగూడ గ్రామానికి చెందిన వలవోతు నందిని (19) విద్యార్థిని కాగా అదే గ్రామానికి చెందిన మంత్రి లోకేష్ (15) బైకు (టీఎస్ 07జిడబ్ల్యు7190) పై మాలగూడ నుంచి ఆకుల మైలారం వైపు వెళ్తున్నారు. ఇంతలోనే వారు ఆకుల మైలారం చేరుకోవడంతో ఓ డ్రైవర్ నిర్లక్ష్యంగా టిప్పర్ (టిఎస్ 07యుఈ 9506) ను నడుపుతూ బైకును ఢీకొట్టాడు. దీంతో బైక్ పై వెళ్తున్న మంత్రి లోకేష్ కు తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందగా గాయపడిన నందిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

# నీటితోట్లను వెంటనే అందుబాటులోకి తేవాలి

– సిపిఎం మండల నాయకులు పిరాటి వెంకటయ్య



**యాచారం, మార్చి 26 (ప్రజాజ్యోతి):** గతంలో ఏర్పాటుచేసిన నీటితోట్లను వినియోగంలోకి తేవాలని సిపిఎం మండల నాయకులు పిరాటి వెంకటయ్య అన్నారు. మంగళవారం చింతపట్లలో గతంలో పశువుల దాహం కోసం ఏర్పాటుచేసిన నీటి తొట్లను ఆ గ్రామ సిపిఎం పార్టీ బృందం ఆధ్వర్యంలో పరిశీలించారు. వెంకటయ్య మాట్లాడుతూ గతంలో గ్రామంలో పశువుల దాహం కోసం నిర్మించిన నీటితోట్ల వద్ద చెట్లు, ముళ్ళకంపలు పెరిగి దర్శనమిస్తున్నాయని వేసవికాలంలో నీటి ఎద్దడి దృష్ట్యా మూగజీవాల కోసం నీటి తొట్లను అందుబాటులోకి తెచ్చి తెచ్చి సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు. నాయకులు సిహెచ్ సత్యం, ఏం జంగయ్య ఏ రమేష్ తదితరులు నీటి తొట్లను పరిశీలించిన వారిలో ఉన్నారు.

# మా గ్రామంలో ఎలాంటి కంపెనీలు ఏర్పాటు చేయొద్దు

– తహసిల్దార్ అయ్యప్పకు రైతుల వినతి

– పరిశ్రమల పేరుతో రైతులను జీవనోపాధికి దూరం చేయొద్దు



**యాచారం, మార్చి 26 (ప్రజాజ్యోతి):** టీఎస్ఐఐసి, ఇతర కంపెనీల కోసం తమ గ్రామంలోని ప్రభుత్వ భూముల సేకరణ కోసం అధికారులు సర్వే చేస్తున్నారన్న నేపథ్యంలో మండల పరిధిలో మంగళవారం మొండిగౌరెల్లి గ్రామ రైతులు తహసిల్దార్ కార్యాలయ ఆవరణలో తహసిల్దార్ అయ్యప్పను కలసి వినతి అందజేశారు. ఆ రైతులు మాట్లాడుతూ.. తమ గ్రామంలో ప్రభుత్వ భూమి సర్వే నెంబరు 19, 68, 127 లలో టిఎస్ఐఐసి, ఇతర పరిశ్రమల ఏర్పాటుకై అధికారులు సర్వేలు నిర్వహిస్తున్నారని గ్రామంలో ఎలాంటి పరిశ్రమలు కంపెనీలు ఏర్పాటు చేయవద్దని అన్నారు. గత 60 ఏళ్లుగా 80 శాతం మంది రైతులు ప్రభుత్వ భూములపై ఆధారపడి వ్యవసాయంతో జీవనం కొనసాగిస్తున్నారని అలాంటి రైతుల జీవనోపాధిని దూరం చేసే అధికారుల నిర్ణయం సరైంది కాదన్నారు. దేశానికి వెన్నెముక లాంటి రైతులకు అన్యాయం చేయడం సమంజసం రైతులకు మరణమే దిక్కని రైతులకు అన్యాయం కలిగించే నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరారు. వినతి అందజేసిన వారిలో గోడుకొండ్ల ప్రవీణ్, యాస ముత్యాలరెడ్డి, తాండ్ర లక్ష్మయ్య, నక్క బాలరాజు యాదవ్, గుర్రం రఘుమరెడ్డి, సంగం రవి, మాజీ ఉప సర్పంచ్ మాదం జంగయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బడే కుమార్, కట్టెల మహేందర్, తాండ్ర అంబెడ్కర్, తాండ్ర శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ సిబ్బంది మొదటి దశ ర్యాండమైజేషన్ పూర్తి

– జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

– మొదటి దశ పోలింగ్ సిబ్బంది రాండమైజేషన్ నిర్వహించిన జిల్లా కలెక్టర్



**పెద్దపల్లి ప్రతినిధి ,(ప్రజాజ్యోతి), మార్చి -26:** జిల్లాలో జరిగే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు పోలింగ్ సిబ్బంది మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ తో కలిసి పోలింగ్ సిబ్బంది మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధి క్రింద పెద్దపెల్లి జిల్లాలో పెద్దపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 290 పోలింగ్ కేంద్రాలు, రామగుండం అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 260 పోలింగ్ కేంద్రాలు, మంథని అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 160 పోలింగ్ కేంద్రాలు, ధర్మపురి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో ధర్మారంకు సంబంధించి 53 పోలింగ్ కేంద్రాలు మొత్తం 763 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని , వీటికి ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారి, ఓపిఓ లను కేటాయించడం జరుగుతుందని అన్నారు. ఎన్నికల కమీషన్ మార్గదర్శకాలు ప్రకారం 20 శాతం అదనంగా సిబ్బంది కేటాయింపు ప్రక్రియ చేపట్టామని తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో మొత్తం 916 మంది ప్రిసైడింగ్ అధికారులు, 916 మంది సహాయక ప్రిసైడింగ్ అధికారులు, 1832 మంది ఓపిఓలకు సంబంధించి పారదర్శకంగా ఎన్.ఐ.సి హైదరాబాద్ రూపొందించిన సాఫ్ట్ వేర్ వినియోగిస్తూ ఆన్ లైన్ మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసామని తెలిపారు. ఈ ర్యాండమైజేషన్ కార్యక్రమంలో పెద్దపల్లి ఆర్డీఓ బి.గంగయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాస్, ఈ.డి.ఎం. కవిత, ఏ.ఎస్.ఓ.అజీమ్, నెట్వర్కింగ్ ఇంజనీరింగ్ రమేష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎట్టి పరిస్థితుల్లోనూ భూములు ఇచ్చే ప్రసక్తి లేదు

– ఎంపీటీసీ తాండ్ర లక్ష్మమ్మ – తహసిల్దార్ అయ్యప్పకు వినతి అందజేత

**యాచారం, మార్చి 26 (ప్రజాజ్యోతి)**: తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ అయ్యప్పకు మంగళవారం మొండి గౌరెల్లి ఎంపీటీసీ తాండ్ర లక్ష్మమ్మ ఆధ్వర్యంలో వినతి అందజేశారు. ఎంపీటీసీ మాట్లాడుతూ తమ గ్రామంలో అసైన్డ్ సర్వే నెంబర్ 19, 68, 127లలో అత్యధికంగా ఎస్సీ బీసీలకు చెందిన రైతుల భూములు ఉన్నాయని భూములపై ఆధారపడి జీవించేవాళ్లు అత్యధికంగా ఉన్నారని పేర్కొన్నారు. హక్కుదారులై ఉన్న అనేక మంది రైతులకు ధరణి సమస్యల వల్ల వారికి పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వలేదని తద్వారా రైతుబంధు రైతు బీమా లబ్ధిని పొందలేకపోతున్నారని అన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించి అర్హులకు పాస్ పుస్తకాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఎలాంటి పరిస్థితులోను 19, 28, 127 సర్వే నెంబర్లలోని భూములు ప్రభుత్వానికి ఇచ్చే ప్రసక్తి లేదని విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరారు. గతంలో ఈ విషయమై అనేక పర్యాయాలు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు.



# ఆంజనేయ స్వామికి వెండి గద భక్తుడి సమర్పణ

**మల్యాల, మార్చి 26 (ప్రజాజ్యోతి) :** మల్యాల మండలం ముత్యంపేట గ్రామం లోని శ్రీ కొండగట్టులో ఆంజనేయ స్వామికి మిట్టపల్లి గ్రామానికి చెందిన మల్లారెడ్డి అనే భక్తుడు స్వామివారికి 250 గ్రాముల వెండి గదను భక్తితో చేయించి ఆలయ అధికారులకు అందజేశారు.

**హుండీ లెక్కింపు**

కొండగట్టు ఆంజనేయ స్వామికి భక్తితో భక్తులు సమర్పించిన కానుకల హుండీ లెక్కింపు బుధవారం రోజు అధికారుల సమక్షంలో జరుపబడు నని ఆలయ కార్యనిర్వహణ అధికారి ప్రకటనలో తెలిపారు.ఆంజనేయ స్వామి పర్వదినమైన మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది అధికారులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షించారు.



